సాక్షి
ఖమ్మం

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



సుదూరంగానే వంద శాతం

జిల్లాలోని ఏ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధ్యం కాకున్నా ఉత్తీర్ణత శాతం మాత్రం పెరిగింది. 10లో



పెసలు.. ధర లేక దిగాలు

ప్రభుత్వ పరంగా పెసల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో వ్యాపారులు ధర తగ్గించి రైతులను మోసం చేస్తున్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నంకల్లా గరిష్టస్థాయికి చేరి వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి



జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మురళీమోహన్

ఖమ్మం లీగల్: ఖమ్మం రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా టి.మురళీమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2016లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఆయన తొలుత నాగర్‌కర్నూల్, ఆ తర్వాత రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లిలోని పదో ఎంఎం కోర్టు, మేడ్చల్‌లోని 11 ఏఎంఎం కోర్టులో విధులు నిర్వర్తించారు. అనంతరం పదోన్నతిపై 2024లో రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా మేడ్చల్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఖమ్మం వచ్చారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా జడ్జి రాజగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్‌రెడ్డి సూచించారు. ఖమ్మంలోని పీఆర్‌టీయూ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. ఈమేరకు ఉపాధ్యాయులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. కాగా, సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు, పీఆర్సీ మంజూరుకు ఇప్పటికే సీఎంను కలిశామని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావుతో పాటు మోత్కూరు మధు, కందుల వెంకటనరసయ్య, విజయ్ అమృత్, ఆర్.బ్రహ్మారెడ్డి, కట్ట శేఖర్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వనజీవి ఆశయానికి అనుగుణంగా..



ఇటీవల కన్నుమూసిన వనజీవి రామయ్య విగ్రహాన్ని ఆయన కుటుంబీకులు చేయించారు. రామయ్య జీవించి ఉన్నప్పుడు ధరించినట్లుగానే 'వృక్షో రక్షతి.. రక్షితః' అని రాసి ఉన్న బోర్డు వేసి ఆయన దశదిన కర్మ సందర్భంగా గురువారం మొక్కలు పంపిణీ చేశారు. 10లో

లక్షణంగా ఇందిరమ్మ ఇళ్లు



20 జీపీల్లో తొలివిడతగా 853 గృహాల మంజూరు

- బేస్‌మెంట్ స్థాయి పూర్తవగానే మొదటి బిల్లు
- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్ష చొప్పున జమ
- అవకతవకలు జరగకుండా ఏఐ టెక్నాలజీతో పరిశీలన



ఈ మహిళ పేరు బానోతు బుజ్జి. కూసుమంచి మండలం ధర్మతండాకు చెందిన ఈమె కుటుంబం ఇన్నాళ్లు చుట్టూ తడికలు కట్టుకుని రేకుల షెడ్‌లో ఉంటోంది. తొలి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో నిర్మాణం బేస్‌మెంట్ వరకు చేపట్టారు. దీంతో రూ.లక్ష బిల్లు ఖాతాలో జమ అయింది. 'మేం ఇల్లు కట్టుకునేలా ప్రభుత్వం అండగా నిలవడంతో మా బాధలు తీరనున్నాయి.' అని బుజ్జి ఆనందంగా వెల్లడించింది.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది. మండలానికి ఓ గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసి తొలి విడతగా ఇరవై గ్రామపంచాయతీల్లో 853 మందికి ఇళ్లు మంజూరుచేశారు. ఇందులో బేస్‌మెంట్ స్థాయికి నిర్మాణం పూర్తిచేసిన వారి ఖాతాల్లో రూ.లక్ష చొప్పున మొదటి బిల్లు జమ చేస్తున్నారు. పైలట్ గ్రామాల్లో నిర్మాణం వేగంగా జరుగుతుండగా.. మిగతా గ్రామాల్లోనూ లబ్ధిదారుల ఎంపికపై అధికారులు దృష్టి సారించారు. సర్వే అనంతరం రెండో విడత అర్హుల జాబితా విడుదల చేస్తారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

జియో ట్యాగ్ చేస్తూ..

ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల మంజూరులో అవకతవకలు జరగకుండా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపడుతోంది. ఇందుకోసం ఏఐ సాయం తీసుకుంటోంది. జిల్లాలో తొలి విడతగా 854 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 320 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయికి చేరాయి. అయితే, పునాదుల దశలోనే 561 ఇళ్లకు జియో ట్యాగ్ చేసి యాప్‌లో ఫొటోలు పొందుపరిచారు. ఇంకా 41 దరఖాస్తులను ఎంపీడీఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

ఎల్–1లో 60,747 దరఖాస్తులు

ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని మూడు కేటగిరీలుగా విభజించారు. సొంత స్థలం ఉండి గుడిసె, రేకులషెడ్, టైల్స్ వేసిన, అద్దె ఇళ్లలో ఉండేవారిని ఎల్–1(లిస్ట్)గా గుర్తించారు. గుడిసెలు, రేకులషెడ్లు, టైల్స్ వేసిన ఇళ్లు, అద్దె ఇళ్లలో ఉంటూ స్థలం కూడా లేని వారిని ఎల్–2 కేటగిరీగా, ఇళ్లు ఉండి.. తల్లిదండ్రుల నుంచి విడిపోయి తమకు ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్న సంతానాన్ని ఎల్–3 కేటగిరీలో చేర్చారు. ఎల్–1 జాబితాలో 60,747 దరఖాస్తుల పునఃపరిశీలన కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అర్హుల జాబితాను కలెక్టర్‌కు పంపిస్తారు. ఆపై ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి పరిశీలించి దశల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

అక్రమాలకు ఆస్కారం లేకుండా..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు జరగకుండా ప్రభుత్వం ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని ఉపయోగిస్తోంది. ఈ టెక్నాలజీ ఆధారంగానే బేస్‌మెంట్ కట్టకుండానే కట్టినట్లు నమోదు చేయగా, భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేశారు. బిల్లు మంజూరుకు సిఫారసు చేసే సమయాన ఏఐ టెక్నాలజీతో ప్రభుత్వం సూపర్ చెకింగ్ చేయిస్తోంది. సదరు ఇళ్ల బేస్‌మెంట్ లెవెల్ ఫొటోను గృహ నిర్మాణ శాఖ యాప్‌లో పొందుపరిస్తే పరిశీలించాక బిల్లు మంజూరుచేస్తారు. దీంతో సంబంధిత యంత్రాంగం, ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న ఇతర శాఖల అధికారులు సైతం అవకతవకలు జరగకుండా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

బేస్‌మెంట్ పూర్తయితే రూ.లక్ష



బేస్‌మెంట్ స్థాయికి చేరిన ఇళ్లకు రూ.లక్ష బిల్లు ఇచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నాం. ఆపై లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమ అవుతోంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. ఒక్కో గ్రామంలో గెజిటెడ్ అధికారి 200 వరకు దరఖాస్తులను పరిశీలిస్తూ, అర్హులు ఎవరెవరో గుర్తిస్తున్నారు.

– భూక్యా శ్రీనివాస్, పీడీ, హౌసింగ్

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇలా...

తొలి విడత మంజూరు	బేస్‌మెంట్ స్థాయికి చేరినవి	జియో ట్యాగ్	ఆన్‌లైన్ చేయాల్సినవి
853	320	561	41

జీపీఎస్ సర్వేతో నూతన భూకొలతలు

- లక్షకు పైగా సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం
- భూ భారతి సదస్సులో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



నేలకొండపల్లి : ముజ్జుగూడెం రైతు సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



తల్లాడ : కుర్నవల్లిలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నేలకొండపల్లి: ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన భూ భారతి చట్టం చట్టంతో భూసంబంధిత సమస్యలన్నీ పరిష్కారమవుతాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూమి స్వభావం, కొలతలు పక్కాగా తేల్చాల్సి ఉన్నందున జీపీఎస్ సాంకేతికతతో కూడిన యంత్రాలతో సర్వే చేయిస్తామని తెలిపారు. తద్వారా యాజమాన్య హక్కులు నిర్ధారించొచ్చని చెప్పారు. అంతేకాక జిల్లాలో పెండింగ్ ఉన్న లక్షకు పైగా సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం కూడా సాధ్యమవుతుందని తెలిపారు. ఇంకా వారసత్వ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, అప్పీల్ తదితర అవకాశాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. అనంతరం చట్టంలోని పలు అంశాలను వ్యవసాయ రైతు సంక్షేమ సంఘం సభ్యుడు, న్యాయవాది 'భూమి' సునీల్ వివరించగా, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ నరసింహారావు, పాలేరు ప్రత్యేకాధికారి రమేష్, ఏడీఏ బి.సరిత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య, ఏఓ ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

సాగులో కొత్త విధానాలతో అధిక దిగుబడి

తల్లాడ: రైతులు కొత్త సాగు విధానాలు అవలంబించేలా అధికారులు అవగాహన కల్పించాలని, తద్వారా అధిక దిగుబడి సాధ్యమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. తల్లాడ మండలం కుర్నవల్లిలో గురువారం వైరా కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులతో మమేకమై వారికి సాగులో మెళకువలను వివరించాలన్నారు. డీఏఓ డి.పుల్లయ్య మాట్లాడగా, సత్తుపల్లి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.జే.హేమంత్‌కుమార్, కేవీకే కోఆర్డినేటర్ కె.రవికుమార్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏఓ ఎం.డీ.తాజుద్దీన్, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏపీఎం అశోకారాణి పాల్గొన్నారు. కాగా, పలువురు రైతులు ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని వెల్లడించగా.. గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి కలెక్టర్ వెళ్లి పరిశీలించారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

- పాల ధర పెంపు, ఎప్పటికప్పుడు చెల్లింపులు
- రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ అమిత్‌రెడ్డి



ఖమ్మం డెయిరీలో పరిశీలిస్తున్న చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ(విజయ డెయిరీ) చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో గురువారం రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పాల బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు చెల్లించడమేకాక గేదె పాల ధరను లీటర్‌కు రూ.5 పెంచామని తెలిపారు. అనంతరం ఇందిరా మహిళా డెయిరీ సభ్యులు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో సంఘాలను ఏర్పాటుచేసుకుని, సేకరించిన పాలను విజయ డెయిరీకి పంపిస్తున్నామని తెలిపారు. అనంతరం చైర్మన్ విజయ డెయిరీలోని వివిధ విభాగాలను పరిశీలించి డిప్యూటీ డైరెక్టర్ పి.మోహనమురళితో చర్చించారు. సంస్థ జనరల్ మేనేజర్ మధుసూదన్‌రావు, అడిషనల్ డీఆర్‌డీఓ నూరుద్దీన్, పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా చైర్మన్ కె.నాగేశ్వరరావు, మేనేజర్ మురళీకృష్ణ, ఉద్యోగులు నాగమణి, హనుమంత్, కృష్ణ, అనితకుమారి, నాగశ్రీ, శ్రీలత, అప్పారావు, వి.మురళీకృష్ణ, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సమీకృత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను చైర్మన్ అమిత్‌రెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, దొబ్బల సౌజన్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌టైప్ మొక్కలపై కదలిక..

- ఆయిల్‌పామ్ తోటల్లో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, శాస్త్రవేత్తల పరిశీలన
- పరిహారం రాకున్నా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడి



తోటలో పరిశీలిస్తున్న చైర్మన్, శాస్త్రవేత్తలు

సత్తుపల్లి: ఆయిల్‌ఫెడ్ నర్సరీల నుంచి ఆఫ్‌టైప్ మొక్కలు పంపిణీ అయ్యాయని, తద్వారా ఐదేళ్ల వయస్సు కలిగిన మొక్కలు తొలగించాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతుండగా.. ఎట్టకేలకు యంత్రాంగం స్పందించింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ అశ్వారావుపేట జోన్ ఫార్మర్ సొసైటీ ప్రతినిధులు ఇటీవల ఢిల్లీలో ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు విన్నవించారు. అలాగే, ఎస్టీ కమిషన్ సభ్యుడిని గిరిజన రైతులు కలిశారు.

తోటల్లో పరిశీలన

రైతుల ఫిర్యాదులతో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, శాస్త్రవేత్తలు గురువారం ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. రిటైర్డ్ శాస్త్రవేత్త బీఎస్.రావు, అధికారులతో కలిసి సత్తుపల్లి మండలం నారాయణపురంలో జగ్గవరపు దామోదర్‌రెడ్డి, మోరంపూడి స్వర్ణలత, గొరిగూడెంలో పాలపాటి శ్రీనివాసరావు తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా చైర్మన్ రాఘవరెడ్డి మాట్లాడుతూ సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీ నుంచి 3లక్షల ఆఫ్‌టైప్ ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేశారనే ప్రచారంలో నిజం లేదన్నారు. మొత్తంగా 11కు గాను ఐదు నర్సరీల్లోనే సమస్యలు ఎదురైనట్లు తేలిందని చెప్పారు. నర్సరీలను ప్రక్షాళన చేస్తే 50శాతం సమస్యలు తీరతాయని చెప్పారు. నాసిరకం మొక్కలు పంపిణీ చేస్తున్నారనే ప్రచారంతో ఆయిల్‌పామ్ సాగుకు కొత్త రైతులు ముందుకు రావడం లేదన్నారు. ఈనేపథ్యాన స్వయంగా తోటల పరిశీలనకు వచ్చామని తెలిపారు. కాగా, నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవని వెల్లడించిన చైర్మన్.. ఉద్యోగుల్లో ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జీఎం సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఇన్‌చార్జ్‌లు ఆర్.రామకృష్ణ, రాధాకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్లు, రైతు సంఘం ప్రతినిధులు తుంబూరు మహేశ్వర రెడ్డి, చెలికాని సూరిబాబు, చెలికాని వెంకట్రావు, బండి శ్రీనివాసరెడ్డి, చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంట మండుతోంది..

జిల్లా అంతటా 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు



ఖమ్మంవ్యవసాయం: సూర్యప్రతాపం నానాటికీ పెరుగుతోంది. జిల్లాలో గురువారం సగటున 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9గంటలకే ఎండ తీవ్రత మొదలై గంటగంటకు తీవ్రరూపం దాల్చడమే కాక సాయంత్రం 5గంటలు దాటినా వేడిగాలులు తగ్గడం లేదు. దీంతో ప్రజలంతా ఉదయం, సాయంత్రమే పనులు చక్కబెట్టుకుంటూ మధ్యాహ్నం ఇళ్లకే పరిమితమవుతున్నారు. జిల్లాలోని మధిరలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం ఖానాపురంలో 42.9, గేటు కారేపల్లి, లింగాలలో 42.8, పమ్మి, సత్తుపల్లి ఓసీల్లో 42.7, రఘునాథపాలెంలో 42.6, పెనుబల్లి 42.5, బాణాపురం, సిరిపురంలలో 42.4, మధిర ఏఆర్‌ఎస్‌లో 42.1, నేలకొండపల్లి, బచ్చోడులో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా ప్రాంతాల్లో అదే పరిస్థితి నెలకొనగా, గృహ విద్యుత్ వినియోగం రెట్టింపైంది. ఖమ్మం సర్కిల్‌లో నిత్యం 5.61 మిలియన్ యూనిట్ల వినియోగం జరుగుతుండగా, ఇందులో 65 శాతం గృహ వినియోగమే ఉంటోందని అధికారులు చెబుతున్నారు.

టెండర్లు వేస్తారా, లేదా?

- కేఎంసీలో పారిశుద్ధ్య పనులపై కాంట్రాక్టర్ల అనాసక్తి
- అధికారుల నిబంధనలే కారణమని చర్చ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ పనులకు టెండర్లు ఆహ్వానిస్తే కాంట్రాక్టర్లు పోటీపడడం సహజం. కానీ ఖమ్మం నగర పాలక సంస్థలో అందుకు విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. పలు పనులకు టెండర్లు ఆహ్వానిస్తే ఎవరూ ఆసక్తి చూపకపోగా, నిబంధనలు సడలించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో రెండు, మూడుసార్లు నోటిఫికేషన్ జారీచేయాల్సి వస్తోంది.

మూడు సార్లు నోటిఫికేషన్

ఖమ్మంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అదనంగా కార్మికుల నియామకానికి కేఎంసీ అధికారులు కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించారు. 180 మంది కార్మికులను సమకూరిస్తే నెలవారీగా వారి జీతభత్యాలకు సంబంధించి బిల్లులు ఇస్తారు. ఇందు కోసం ఇప్పటి వరకు మూడు సార్లు నోటిఫికేషన్ జారీ చేసినా ఏ కాంట్రాక్టర్ టెండర్ వేయలేదు. గతంలో ఇదే పనికి కాంట్రాక్టర్లు పోటీ పడగా.. ఈసారి నిరాసక్తత కనబర్చడం గమనార్హం.

మా వల్ల కాదు...

పారిశుద్ధ్య కార్మికులను సమకూర్చే కాంట్రాక్టర్లు వారికి పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించాలని, వేతనాలు ఖాతాల్లో జమ చేయగానే స్టేట్‌మెంట్ సమర్పించాలనే నిబంధనలను నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. గతంలో లేని నిబంధనలను విధించడం సరికాదని చెబుతూ, రోజువారీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ ఎలా చెల్లించగలమని కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది. ఐదు శాతం కమీషన్‌తో కార్మికులను సమకూర్చే తమకు ఈ పనులన్నీ సాధ్యం కాదని చెబుతున్నట్లు సమాచారం.

మరేం చేద్దాం?

పారిశుద్ధ్య కార్మికులను సమకూర్చడానికి ఇప్పటికి మూడుసార్లు నోటిఫికేషన్ విడుదల చేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అధికారులు పునరాలోచనలో పడినట్లు తెలిసింది. మరోమారు నోటిఫికేషన్ ఇవ్వాలా.. లేక టీఎల్ఎఫ్ ద్వారా కార్మికులను సమకూర్చుకోవాలనే భావనలో ఉన్నట్లు సమాచారం. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో చర్చించాక తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

చేప పెరగదు.. కడుపు నిండదు

- కేజీకి మించి బరువు పెరగని జలపుష్పాలు
- ప్రభుత్వ, ప్రైవేట్ సీడ్లు రెండింటి పరిస్థితి అదే...
- నష్టపోతున్నామని మత్స్యకారుల ఆవేదన





చేపల లభించక నిరుత్సాహంతో వస్తున్న మత్స్యకారులు (ఇన్‌సెట్) కేజీ కూడా బరువు పెరగని చేప

వైరా: జిల్లాలో పేరున్న వైరా రిజర్వాయర్‌పై ఆధారపడి 1,600 మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. ఈ రిజర్వాయర్‌లో పెంచే చేపలు రుచిగా ఉంటాయనే నమ్మకంతో జిల్లావ్యాప్తంగా ప్రజలు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తారు. కానీ ఈసారి చేపల బరువు ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో మత్స్యకారుల్లో నిర్వేదం అలుముకోగా.. కొనుగోలుకు వస్తున్న ప్రజలు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

రెండు విడతల్లో పిల్లల విడుదల

గత ఏడాది అక్టోబర్ 19వ తేదీన 13లక్షల చేప పిల్లలను ప్రభుత్వం తరఫున రిజర్వాయర్‌లో వదిలారు. ఆతర్వాత మత్స్య సహకార సొసైటీ ద్వారా రూ.10 లక్షలు విలువైన మరో 14 లక్షల చేపపిల్లలను గత ఏడాది డిసెంబర్‌లో వదిలారు. సహజంగా చేపలు ఇప్పటికే కేజీకి పైగా బరువు పెరగాలి. ఇదే నమ్మకంతో గురువారం నుండి రిజర్వాయర్‌లో మత్స్యకారులు వేట ఆరంభంగా వారికి నిరాశే ఎదురైంది. ఏ చేప కూడా కేజీ బరువు దాటకపోగా.. పట్టాలు, వదిలేయాలా అన్న మీమాంస ఎదుర్కొన్నారు. రెండు విడతలుగా పోసిన చేప పిల్లలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో ఖాళీ వలలతో ఒడ్డుకు చేరారు.

ఎందుకు పెరగలేదంటే...

వైరా రిజర్వాయర్‌లో 27లక్షల చేప పిల్లలను వదిలినా అవి నాసిరకం కావడంతోనే ఆశించిన సైజుకు చేరలేదని మత్స్యకారులు చెబుతున్నారు. బొచ్చ, రవ్వ, మృగాలతో పాటుగా రొయ్యపిల్లలు కూడా విడుదల చేశారు. అయితే, కొందరు గడువు రాకున్నా సన్నకన్నులు కలిగిన వలలతో చేపలు పట్టారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతోనే ఈ పరిస్థితి ఎదురైందని అధికారుల వాదనగా ఉంది. ఇరువర్గాల వాదనలు భిన్నంగా ఉన్నా, రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదిలే సమయాన రెండున్నర నుంచి మూడు అంగుళాల సైజులో ఉండగా, ప్రస్తుతం అర కేజీ నుంచి ముప్పావు కేజీ కూడా పెరగకపోవడం గమనార్హం. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఈ పరిస్థితి ఎదురైనందున తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

రోజంతా వేటాడితే ఎనిమిది కేజీలే..



రిజర్వాయర్‌లో గత 20 ఏళ్లుగా చేపల వేట కొనసాగిస్తున్నా. రోజు మొత్తం షికార్ చేస్తే ఎనిమిది కేజీల చేపలే దొరికాయి. గతంలో రోజు మొత్తం మీద క్వింటాకు పైగా చేపలు లభించేవి. కానీ ఇప్పుడు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– షేక్ బాబు , మత్స్యకారుడు వైరా

వలలు, తెప్పలకే ఖర్చు



చేపల వేట కోసం అవసరమైన వలలు, తెప్పలు కొనుగోలుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చు చేసి చేపల వేటకు వెళ్తే రోజు మొత్తం మీద రూ.500 కూడా రాలేదు. మా పరిస్థితి దయనీయంగా మారింది.

– షేక్ ఖాదర్, మత్స్యకారుడు, వైరా

మత్స్యకారులకు నష్టమే...



రూ.10లక్షల విలువైన 14 లక్షల సీడ్ సొంతంగా పోశామని మత్స్యకారులు చెబుతున్నారు. కానీ ఒక్కొక్కరికి పది కేజీల చేపలు కూడా పడడం లేదు. తద్వారా మత్స్యకారులకు నష్టమే. అధికారులు పట్టించుకుంటే న్యాయం జరుగుతుంది.

– ఫణితి సురేష్, సొసైటీ సభ్యుడు, వైరా

సుదూరంగానే వంద శాతం..

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పెరిగిన ఉత్తీర్ణత
- ఎక్కడా నమోదుకాని శత శాతం ఫలితాలు
- గత ఏడాదితో పోలిస్తే మాత్రం మెరుగు



సిరిపురంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం గతంతో పోలిస్తే కాస్త మెరుగుపడింది. గతేడాది ప్రథమ సంవత్సరంలో 39.06శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ ఏడాది 48.97శాతానికి, ద్వితీయ సంవత్సరంలో గతేడాది 60.45శాతం ఉంటే, ఈసారి 65.81శాతానికి పెరిగింది. విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు ముందుగా సమకూర్చడం, సరిపడా అధ్యాపకుల నియామకంతో పరిస్థితులో మార్పు వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

అన్నీ కాదు...

జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 4,396మంది పరీక్షలు రాయగా 2,499మంది ఉత్తీర్ణత సాధించారు. కొందరు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం విశేషం. అయితే, ఏ కాలేజీలో కూడా వంద శాతం ఫలితాలు రాలేదు. ప్రథమ సంవత్సరంలో అత్యధికంగా మధిర మండలం సిరిపురం జూనియర్ కళాశాలలో 32మంది విద్యార్థులు పరీక్ష రాయగా 23మంది(71.88శాతం) ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా కామేపల్లి జూనియర్ కళాశాల నుంచి 23మందిలో ఆరుగురే ఉత్తీర్ణులయ్యారు. బనిగండ్లపాడు కాలేజీలో 65.63శాతం, ఖమ్మం ప్రభుత్వ బాలికల కళాశాలలో 60.46, మధిర జూనియర్ కళాశాలలో 59, నేలకొండపల్లి కళాశాలలో 55.56, ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలలో 53.29, నాగులవంచ జూనియర్ కళాశాలలో 50శాతం ఫలితాలు సాధించగా... మిగతా కళాశాలలు 50శాతం దాటలేదు.

ద్వితీయంలో మెరుగు

ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బనిగండ్లపాడు జూనియర్ కళాశాల విద్యార్థులు 89మందికి 78మంది(87.64శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఇక కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గురికి ముగ్గురు ఫెయిల్ కావడంతో సున్నా శాతంతో ఆఖరున నిలిచింది. కామేపల్లి జూనియర్ కళాశాలలో 38.71, వైరా కళాశాలలో 47.62శాతం, పిండిప్రోలు కళాశాల 48.91శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఫలితాలు పెరిగాయి



ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలు గతంతో పోలిస్తే పెరిగాయి. ఏటా ప్రథమ సంవత్సరం కంటే ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెరుగుతోంది. ఈ ఏడాది మొదటి నుంచే మరింత శ్రద్ధ వహిస్తూ మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేస్తాం.

– కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి

కేజీబీవీల్లోనూ అత్యుత్తమ మార్కులు

జిల్లాలోని 14 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ల్లో ఇంటర్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులయ్యారని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ) తులసి తెలిపారు. అన్ని కేజీబీవీల్లో ప్రథమ సంవత్సరంలో 709మందికి 557మంది(79శాతం), ద్వితీయ సంవత్సరంలో 661మందికి 584మంది(89శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. కేజీబీవీల్లో బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెరుగైన బోధన అందించడంతో ఈ ఫలితాలు వచ్చాయని తెలిపారు. బోనకల్ కేజీబీవీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. వచ్చే ఏడాది అన్ని కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా కృషిచేస్తామని పేర్కొన్నారు.



బోనకల్ కేజీబీవీ అధ్యాపకులతో జీసీడీఓ తులసి

సంక్షేమ గురుకుల విద్యార్థులు భేష్


468 మార్కులు సాధించిన బీసీ గురుకులం విద్యార్థి శ్రీచరణ్

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ సంక్షేమ గురుకులాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎస్సీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివిన పలువురు ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా ఫలితాలు సాధించారు. బీసీ గురుకులాలకు సంబంధించి వనంవారి కిష్టాపురం గురుకులం ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థి వి.శ్రీచరణ్ 470మార్కులకు 468 మార్కులు సాధించారు. ముదిగొండ మండలం కమలాపురానికి చెందిన ఆయన రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం విశేషం. గ్రామానికి చెందిన శ్రీ చరణ్ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం విశేషం. కాగా, వనంవారి కిష్టాపురానికి మంజూరైన ఈ గురుకులం ప్రస్తుతం మధిర మండలం కిష్టాపురంలో కొనసాగుతోంది.

● **ఎస్సీ గురుకులాలు :** జిల్లాలో 11 ఎస్సీ సంక్షేమ శాఖ గురుకులాలు ఉండగా.. మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్, సీఈసీ, ఎంఈసీలో 956 మందికి గాను 789 మంది(82.53 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో పరీక్షలు రాసిన 975 మంది విద్యార్థులకు గాను 900 మంది(92.31 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

● **బీసీ గురుకులాలు :** బీసీ గురుకులాలు జిల్లాలో 11 ఉండగా.. మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలకు 646 మంది హాజరుకాగా 488 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో 344 మందికి 271 మంది ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 660 మందికి 590 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ గ్రూపులో 337 మందికి 312, బైపీసీ గ్రూపులో 182కు 159 మంది, సీఈసీ గ్రూపులో 84కు 68 మంది, హెచ్ఈసీ గ్రూపులో 27 మందికి 21 మంది, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో 30 మందికి 30 మంది ఉత్తీర్ణతతో వంద శాతంగా నమోదైందని వెల్లడించారు.

● **మైనారిటీ గురుకులాలు :** జిల్లాలో ఏడు మైనార్టీ గురుకులాలు ఉండగా.. మొదటి సంవత్సరంలో 334మంది విద్యార్థులకు 273 మంది(82 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 332 మందికి 284 మంది(86 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

అప్పులు ఉన్నా.. అభివృద్ధి బాట పట్టించాం

పార్టీ శ్రేణుల సమావేశంలో మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ మితిమీరిన అప్పులు చేసినా.. తాము అధికారంలోకి వచ్చాక అన్నీ సరిదిద్దుతూ అభివృద్ధి బాట పట్టిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాదిన్నరగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కులగణనతో పేద వర్గాలకు రాజ్యాధికారంలో వాటా లభిస్తుందని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టుకు అనుమతి లభించిందనున రానున్న రోజుల్లో 7లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి తెలిపారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నందున కార్యకర్తలు సన్నద్ధం కావాలని, ఖమ్మం నియోజకవర్గంలో రూ.2,200 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాగా, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ నిర్వహణలో రఘునాథపాలెం మండలం వెనుకబడినందున అన్ని జీపీల్లో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇక క్రమశిక్షణతో మెలగడంతో పాటు మంచి వ్యక్తిత్వం కలిగిన కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈసమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, కమర్తపు మురళి, సాదు రమేష్‌రెడ్డి, ఫాతిమా జోహరా, దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెసలు.. ధర లేక దిగాలు

- ఉమ్మడి జిల్లాలో 10 వేల ఎకరాల్లో పంట సాగు
- ప్రభుత్వ కొనుగోళ్లు లేక వ్యాపారుల ఇష్టారాజ్యం
- క్వింటాకు రూ.2,500 మేర నష్టపోతున్న రైతులు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పెసలు

ఖమ్మంవ్యవసాయం: యాసంగిలో రైతులు సాగు చేసిన పెసర పంటకు కనీస మద్దతు ధర కరువైంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.8,682గా మద్దతు ధర నిర్ణయించినా ఎక్కడా అది అమలు కావడం లేదు. పెసర పంట ప్రస్తుతం చేతికందుతుండగా, కొందరు రైతులు విక్రయిస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంటకు వ్యాపారులు గురువారం గరిష్ఠంగా రూ.7,050 ధర నిర్ణయించగా, మోడల్ ధర రూ.6,200, కనిష్ఠ ధర రూ.4 వేలే అందుతోంది. జెండాపాట ధర గరిష్ఠ ధర ఖరారు చేస్తున్నప్పటికీ.. ఎక్కువ పంటను మోడల్, కనిష్ఠ ధరలకు కొనుగోలు చేస్తుండడంతో రైతులకు నష్టం ఎదురవుతోంది.

దిగుబడి అంతంతే..

ఈ ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యాసంగి పంటగా 10 వేల ఎకరాల్లో పెసర సాగు చేశారు. సమృద్ధిగా నీరు ఉండడంతో ఎక్కువ మంది మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యత ఇవ్వడంతో గత ఏడాదితో పోలిస్తే ఈ సారి పెసర విస్తీర్ణం తగ్గింది. నీటి తడులు సమృద్ధిగా అందించిన చోట ఎకరాకు 5 – 6 క్వింటాళ్లు, మిగతా ప్రాంతాల్లో 2 – 3 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దిగుబడి తగ్గిన నేపథ్యాన ధర అయినా మెరుగ్గా ఉంటుందని భావిస్తే పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

డిమాండ్ ఉన్నా తక్కువ ధర

పెసల కొనుగోళ్లలో వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం క్వింటా పెసలకు రూ.8,682 మద్దతు ధర నిర్ణయించినా ఆ ధర రైతులకు లభించటం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆ ధర దక్కే అవకాశం ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా వ్యాపారులే ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో పంట నాణ్యత ఆధారంగా క్వింటాకు రూ.4 వేల నుంచి రూ.5,500 వరకు చెల్లిస్తుండగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.700 నుంచి రూ.7,300 వరకు ధర పలుకుతోంది. దిగుబడి తగ్గిన నేపథ్యాన పంటకు డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు లేక..

పంట నాణ్యతగా ఉండడం.. డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారుల తీరుతో క్వింటాకు రూ.2,500 వరకు రైతులు నష్టపోతున్నారు. నాణ్యత లేని పంటకు రూ.3,700కు మించి చెల్లించడంలేదు. పెసల విక్రయాలు ప్రారంభమై, రైతులు దోపిడీకి గురవుతున్నా ప్రభుత్వం దృష్టి సారించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. రెండేళ్ల కిందటి వరకు నాఫెడ్ సహకారంతో మార్క్‌ఫెడ్ పెసలను కొనుగోలు చేయగా.. ప్రస్తుతం అలాంటి ఆలోచన ఏదీ లేనట్లు తెలుస్తుండగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్రమహాసభలు

తొలిరోజు ప్రదర్శన, బహిరంగ సభ



ఖమ్మం కాల్వొడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఖమ్మంమయూరిసెంటర్: విద్యా రంగ సమస్యలపై చర్చించి, పోరాట కార్యాచరణ రూపొందించేందుకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలు వేదికగా నిలవనున్నాయి. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా ప్రాంగణంతోపాటు నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట ఎర్రతోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 2002లో ఖమ్మంలో సంఘం రాష్ట్ర మహాసభలు జరగ్గా.. తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి ఇప్పుడు నిర్వహిస్తున్నారు. సభల్లో భాగంగా తొలిరోజైన శుక్రవారం జెడ్పీ సెంటర్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు భారీ ప్రదర్శన, ఆతర్వాత కళాక్షేత్రంలో బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సభకు రాష్ట్ర నలుమూలల నుంచి 500మంది ప్రతినిధులతో పాటు జిల్లా నాయకులు పాల్గొననున్నారు. కాగా, సభలో ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీ.పీ.సాను ప్రసంగించనుండగా.. సినీ నటుడు మాదాల రవి, ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ్, ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

తల్లాడ: మండలంలోని ముద్దునూరు చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని గురువారం ఉదయం గుర్తించారు. గేదెలను కాపాడే క్రమాన బుధవారం కాకర్ల అప్పారావు(65) చెరువులో గల్లంతైన విషయం విదితమే. ఈమేరకు మృతదేహం తేలగా పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

'ఎవరెస్ట్' అధిరోహించేందుకు సహకరించండి

తల్లాడ: నేపాల్‌లోని ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు సిద్ధంగా ఉన్న తనకు సహకరించాలని బాదావత్ మోతీకుమార్ కోరాడు. తల్లాడలో గురువారం ఆయన పలువురిని కలిసి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశాడు. రష్యా ఖండంలోని రెండు పర్వతాలను ఇప్పటికే అధిరోహించాలని తెలిపాడు. ఇప్పుడు ఎవరెస్ట్ ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న తరుణాన చేయూతనివ్వాలని కోరాడు.

బార్లకు 12 దరఖాస్తులు

ఖమ్మంక్రైం: ఖమ్మం కేంద్రంలో రెండు బార్ల ఏర్పాటుకు గురువారం ఒకేరోజు 12 దరఖాస్తులు అందాయి. దీంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 22కు చేరగా,ఈనెల 26వ తేదీ వరకు గడువు ఉందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈనెల 29న డ్రా ద్వారా బార్లు కేటాయించనున్నారు.

నేటి సదస్సును విజయవంతం చేయండి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలో నిర్వహించే ర్యాలీ, టీఎన్జీవోస్ హాల్‌లో జరిగే ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయాలని టీజేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ కోరారు. టీజీవోస్ కార్యాలయం గురువారం టీజేఏసీ బాధ్యులు పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. టీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొననుండగా సదస్సుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. ఈకార్యక్రమంలో మోదుగు వేలాద్రి, తాళ్లూరి శ్రీకాంత్, ఉషాశ్రీ, పి.సుధారాణి, విజయకుమారి, పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్నానం చేసొచ్చేసరికి రూ.12 లక్షల ఆభరణాలు మాయం

సత్తుపల్లిటౌన్: సొరుగులో భద్రపరిచి స్నానం చేసి వచ్చే సరికి రూ.12 లక్షల బంగారు ఆభరణాలు కనిపించకపోగా, పనిమనిషిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్తుపల్లి కాకర్లపల్లి రోడ్డులో నివాసముండే నరుకుళ్ల వసంతరావు భార్య నీలావతి స్నానానికి వెళ్తూ తన మెడలోని 4కాసుల ముత్యాలు, పగడాల గొలుసు, 10 కాసుల నాలుగు బంగారు గాజులను గురువారం పర్సులో పెట్టి సొరుగులో దాచింది. తిరిగి వచ్చేసరికి రూ.12లక్షల విలువైన ఈ ఆభరణాలు కానరాలేదు. దీంతో ఇంటి పనిమనిషిపై అనుమానంతో నీలవేణి అల్లుడు మేడా కాంతారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
పెసలు	7,050	4,000
కందులు	6,500	6,500
అలసంద	6,150	6,000
మిర్చి	13,675	5,800
మిర్చి తాలు	5,600	4,500
పత్తి	7,300	6,100

– ఖమ్మం వ్యవసాయం

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు..

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
- కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర బృందం


కాంటా వేసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం, అధికారులు

ఖమ్మం సహకారనగర్: రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని నాణ్యత ఆధారంగా ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని గురువారం ఆయన రాష్ట్ర బృందం సభ్యులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 29,695 టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 799మంది రైతులు 6,165 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం అమ్మారని తెలిపారు. వీరికి రూ.3,08,25,600 మేర బోనస్ అందిందని చెప్పారు. తొలుత పౌర సరఫరాల శాఖ డిప్యూటీ కమిషనర్ కొండల్‌రావు, జనరల్ మేనేజర్ నాగేశ్వరరావుతో కూడిన బృందం కూసుమంచి మండలం పాలేరులోని కొనుగోలు కేంద్రాలు, నేలకొండపల్లి మండలంలోని అరుణాచల రైస్ మిల్లును తనిఖీ చేశారు. నాణ్యమైన ధాన్యమే కొనుగోలు చేయాలని, సీరియల్ ఆధారంగా కాంటా వేయించి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. ఎండ లేని సమయాల్లోనే కాంటా వేస్తూ, రైతులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, డీఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వనజీవి ఆశయానికి అనుగుణంగా..

3వేల మొక్కలు పంపిణీ చేసిన రామయ్య మనవరాలు


జూట్ బ్యాగ్, మొక్క అందిస్తున్న గౌతమిరమేష్

ఖమ్మంరూరల్: ఇటీవల మృతి చెందిన పద్మశ్రీ వనజీవి రామయ్య దశదినకర్మ ఆయన స్వగ్రామమైన రూరల్ మండలం రెడ్డిపల్లిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేయించిన రామయ్య విగ్రహానికి ఆయన బతికి ఉన్నప్పుడు ధరించినట్లుగా వృక్షో రక్షతి.. రక్షితః అని రాసి ఉన్న బోర్డు అమర్చారు. ఈకార్యక్రమానికి హాజరైన వారికి ఆయన మనవరాలు గౌతమిరమేష్ మూడు వేల జూట్ బ్యాగ్‌లు, మొక్కలు అందించారు. తన తాత ఆశయాలను కొనసాగిస్తామని ఆమెతో పాటు కుటుంబీకులు తెలిపారు. కాగా, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తదితరులు రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించడంతో పాటు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


భద్రు (ఫైల్)

కారేపల్లి: వ్యవసాయంలో నష్టాలతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని దుబ్బతండా గ్రామానికి చెందిన లావుడ్యా భద్రు(52) నాలుగెకరాల్లో మిర్చి, పత్తి సాగు చేశాడు. గత మూడేళ్లుగా సరైన దిగుబడి రాకపోగా, పెట్టుబడికి తెచ్చిన అప్పులు రూ.6లక్షలకు చేరాయి. ఈక్రమాన ఓ ఫెర్టిలైజర్ షాపులో గుమస్తాగా పని చేస్తుండగా, ఆర్థిక ఇబ్బందులు తీరకపోవడంతో బుధవారం సాయంత్రం మద్యం సేవించి చేనుకు వెళ్లిన ఆయన అక్కడే పురుగుల మందు తాగాడు. ఆతర్వాత భార్య అచ్చమ్మకు ఫోన్ చేయగా కుటుంబీకులు హుటాహుటిన భద్రును ఖమ్మం ఆస్పత్రికి తరలించగా గురువారం మృతి చెందాడు. ఆయన కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని వృద్ధుడు..

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన కె.వెంకన్న (58) కుటుంబ తగాదాల కారణంగా గురువారం శివార్లలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్నేహితులు మోసం చేశారని...

ఖమ్మంరూరల్: ఓ యువకుడి క్రెడిట్ కార్డు ద్వారా స్నేహితులు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమలాయపాలెం మండలం రాజారానికి చెందిన మెట్టు కరుణాకర్(29) ప్రైవేట్ ఉద్యోగం పనిచేస్తున్నాడు. ఆయన క్రెడిట్ కార్డు తీసుకున్న స్నేహితులు అప్పులు చేయగా, అవి తీర్చలేక మనస్తాపానికి గురైనట్లు తెలిసింది. బుధవారం రాత్రి జలగంనగర్‌లోని అక్క ఇంటికి వచ్చిన ఆయన దాబాపై నిద్రించాడు. ఉదయంకల్లా రాడ్‌కు ఉరి వేసుకోగా, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం ప్రశాంతినగర్‌కు చెందిన పుచ్చకాయల అనంతరాములుకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ గురువారం తీర్పు చెప్పారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన గుగులోత్ రామ్మూర్తి వద్ద అనంతరాములు 2021లో రూ.3.80లక్షలు తీసుకున్నాడు. ఈ అప్పు చెల్లించే క్రమాన 2022లో రూ.4.54లక్షలకు చెక్కు జారీ చేసినా ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. దీంతో విచారణ అనంతరం అనంతరాములుకు జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.4.54లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

ఇంకో కేసులో మరొకరికి...

చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో ఖమ్మం టేకులపల్లికి చెందిన గద్దం ధనుంజయకు ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బిందుప్రియ తీర్పు చెప్పారు. ద్వారకనగర్‌కు చెందిన పెంట్యాల వాసు వద్ద ధనుంజయ 2016లో రూ.5లక్షల అప్పు తీసుకుని 2018లో రూ.రూ.5లక్షలకు చెక్కు ఇచ్చాడు. కానీ ఈ చెక్కు చెల్లకపోవడంతో వాసు కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఈమేరకు నిందితుడికి జైలుశిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.5లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించారు.

ఆక్రమణలు తొలగింపు


డ్రెయినేజీపై అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం 43వ డివిజన్‌లో డ్రెయినేజీల ఆక్రమించి పలు షాపుల యాజమానులు ఏర్పాటుచేసిన ర్యాంపులు, ఇతర నిర్మాణాలను కేఎంసీ అధికారులు గురువారం తొలగించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా డబ్బాలు, ఇతర నిర్మాణాలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను జేసీబీల సహకారంతో కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వసుంధర, ఉద్యోగులు పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న వ్యాన్లు పట్టివేత

తల్లాడ: తల్లాడ మీదుగా అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యాన్లను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బి.కొండల్‌రావు ఆధ్వర్యాన వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయనగరం నుంచి హైదరాబాద్ వెళ్తున్న రెండు ఐషర్ వ్యాన్లు వచ్చాయి. అందులో పరిశీలించగా గోవులు, ఎద్దులు ఉండడంతో హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్నట్లు తేలింది. విజయనగరం మానాపురం నుండి నాయుడు అనే వ్యక్తి వీటిని హైదరాబాద్‌లో మహ్మద్ రఫీకి విక్రయించేందుకు వెళ్తున్నట్లు గుర్తించిన పోలీసులను పశువులకు పాల్వంచలోని గోశాలకు తరలించారు. అలాగే, నాయుడు, రఫీతో పాటు వ్యాన్ల యజమానులు, డ్రైవర్లు జాలా రాజు, చుట్టూరి శేఖర్‌గౌడ్, కొల్లి నాగరాజు, బుద్దాల దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


వీ.వీ.పాలెంలో గుర్తించిన మృతదేహం

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం గుర్తించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ఇచ్చిన సమాచారంతో రఘునాథపాలెం పోలీసులు చేరుకుని అన్నం ఫౌండేషన్ సభ్యుల చేయూతతో మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

చికిత్స పొందుతున్న మహిళ...

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలకు చెందిన దంతాల జ్యోతి(27) కుటుంబ ఘర్షణలతో బుధవారం పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆమె భర్త మద్యానికి బానిస కావడంతోపాటు కుటుంబ ఘర్షణతో క్షణికావేశానికి గురై పురుగుల మందు తాగింది. ఈమేరకు చికిత్స చేయిస్తుండగా మృతి చెందగా, జ్యోతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

వీఎం బంజర్‌లో...

పెనుబల్లి: మండలంలోని వీఎం బంజర్‌లో రోడ్డు పక్కన గురువారం అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని స్థానికులు పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిని కొత్తకారాయిగూడెంకు చెందిన వడ్రంగి నెల్లూరి బోధనాచారి అలియాస్ చంటి(37)గా గుర్తించారు. వడదెబ్బతో ఆయన మృతి చెంది ఉంటారని భావిస్తుండగా, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.